www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 31 జనవరి 2025

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

## కాలేరులో ఉచిత పశు వైద్య శిబిరం



పాడి రైతులకు మందుల అందజేత

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కాలేరు లో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశు వైద్యాధికారి వివి.రమణ మూర్తి పర్యవేక్షణలో 92 గేదెలు, ఆవులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశవ్యాధుల చికిత్సలు, మందులు, కోళ్లకు టీకాలు చేశారు. ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ వివి.రమణ మూర్తి, డాక్టర్ కెవిఆర్ఎస్ఎన్.ప్రసన్న, డాక్టర్ కె.లక్ష్మీ మాధురి, పశు వైద్య సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# పనిభారం పెంచారు.. జీతం మరిచారు

- వేతనాలు అందక అల్లాడుతున్న విఒఎలు
- బకాయిల కోసం ఎదురుచూపులు
- పెదవి విప్పని అధికారులు

అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డ్వాక్రా యానిమేటర్లు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - రాజోలు

మహిళా సాధికారిత, స్వావలంబన కోసం నిరంతరం పనిచేసే క్షేత్ర స్థాయి సిబ్బందిపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేస్తోంది. గత ఆరు నెలలుగా జీతాలు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులకు రాజకీయ వేధింపులకు గురిచేస్తున్న కూటమి పాలకులు విఒఎలు, ఆర్‌పిలను కూడా వేధిస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-వెలుగు సంస్థలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను ఆర్థికంగా తీర్చిదిద్దే గ్రామ స్థాయి ఉద్యోగులు సిఎఫ్(విఒఎ), పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) పరిధిలో వార్డుల్లో పనిచేస్తున్న ఆర్‌పిలకు ఆరు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలలు దాటినా క్షేత్రస్థాయి ఉద్యోగులు జీతాలు విడుదల చేయలేదు. దీంతో వీరికి అవస్థలు తప్పడం లేదు. రూ.3వేలు ఉన్న వీరి జీతాలను గత ప్రభుత్వంలో అప్పటి సిఎం వైఎస్ జగన్ రూ.8వేలకు పెంచారు. మరో రూ.2 వేలు గ్రామ సంఘం లాభాల నిధుల నుంచి తీసుకునేలా వెసులుబాటు కల్పించారు. ఐదేళ్ల పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా వీరికి వేతనాలు అందాయి. గత ఏడాది మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వీరికి జీతాలు ఆగాయి. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి జిల్లాలోని డిఆర్‌డిఎ పరిధిలో 2892 మంది ఉండగా తూర్పుగోదావరిజిల్లాలో 815 మంది, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1017 మంది, కాకినాడ జిల్లాలో 1060 మంది సిఎఫ్‌లు (విఒఎ)లు ఉన్నారు. మెప్మా పరిధిలో ఆర్‌పిలు సుమారు 80 మంది ఉన్నారు. వీరికి ఆరు నెలలుగా రావలసి సుమారు రూ.18 కోట్లు బకాయిలు నిలిచిపోయాయి. జీతాలు లేక వీరంతా అల్లాడిపోతున్నారు.

### విఒఎలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు

గ్రామ సంఘాల నిర్వహణ, సమావేశాలు నిర్వహించడం, వారికి సూచనలు సలహాలు అందజేయడం, ప్రతి నెల రెండు పర్యాయాలు సంఘాల కు వివరాలతో బుక్కీపింగ్, సంఘాలకు బ్యాంకు రుణాలు (లింకేజీలు) అందజేయడం, నేత్రనిధి రుణా లు అందజేయడం, లోకోస్, లఖ్ పత్ దీది, ఎన్బియు సర్వే, స్త్రీనిధి రుణాలు, పిఒపి, ఎస్‌సిఎస్‌పి రుణాలు ఎన్‌ఆర్‌ఎల్ ప్రాజెక్ట్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఎన్ఆర్వైఎం పాలసీ లో భాగంగా లైవ్లీహుడ్ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల అమలు, నిర్వహణ, పర్యవేక్షణ వంటివెన్నో వీరు చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమాలు, ఇతర కార్యక్రమాలకు జన సేకరణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటివి వీరు నిర్వహిస్తున్నారు. ఇంతచేస్తున్నా జీతాల బకాయిలు ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### పెరిగిపోతున్న అప్పులు

ప్రభుత్వం ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో డిఆర్‌డిఎ సెర్ప్ యానిమేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ కోసం విధిలేని పరిస్థితుల్లో అప్పులు చేస్తున్నారు. నిత్యావసర సరుకులు, ఇతరత్రా అవసరాలకు అవసరమైన వస్తువులు, మందులు అప్పుపై తెచ్చి జీతం వచ్చిన వెంటనే చెల్లిస్తుంటారు. దీనికితోడు ఇంటి నిర్మాణానికి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నవారు ఉన్నారు. గృహోపకరణాలు, ఇతర వస్తువులను ఈఎంఐ పద్ధతిలో తీసుకుంటారు. ప్రతినెలా నిర్ణీత తేదీల్లో బ్యాంకులకు కిస్తీలు చెల్లించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో బయట అప్పులు తెచ్చి ఈఎంఐలు, బ్యాంకు రుణాలు, ఇంటి అద్దెలు కడుతున్నారు. జీతం వచ్చిన వెంటనే చెల్లిస్తామని అప్పులు తెచ్చిన వారిపై రుణదాతల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. జీతాలు ఎప్పుడొస్తాయో తెలియక బాకీదారులకు కచ్చితమైన సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. జీతం విడుదలైనా ఎన్నినెలలకు వస్తుందో, ఉన్న అప్పులు ఎంతవరకు సర్దుబాటు కాగలవోనని ఆందోళన చెందుతున్నారు. తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఆరు నెలల జీతాలు ఒకేసారి విడుదల చేసి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రభుత్వం స్పందించి విఒఎలకు బకాయి వేతనాలు చెల్లించాలి. ఆర్థిక ఇబ్బందులు నుంచి విఒఎ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గత మూడు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా విఒఎలు అక్రమ తొలగింపులకు, వేధింపులకు గురవుతున్నారు. వందలాది మందిని తొలగించారు. మరి కొంతమందిని తొలగించడానికి జాబితాలు తయారు చేసి ఉద్యోగం నుంచి తొలగిపోవాలని వేధిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విఒఎల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.

**-కె.కృష్ణవేణి , సిఐటియు జిల్లా కార్యదర్శి, అంబేద్కర్ కోనసీమ జిల్లా**

ఆత్మీయ పరిచయ వేదికలో పాల్గొన్న పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిని రాఘవులు

## పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులను అధిక మెజారిటీతో గెలిపించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఇళ్ళ వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి పిలుపునిచ్చారు. అమలాపురం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో గురువారం నిర్వహించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి ఆత్మీయ పరిచయ వేదికలో ఎంఎల్‌సిలు ఐవి, గోపిమూర్తి మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కోసం చట్టసభల్లో పట్టభద్రుల వాణి వినిపించేలా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు గతంలో కూడా పోరాటం చేశారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ యుటిఎఫ్ నుంచి గతంలో టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికలు మాత్రమే పోటీ చేసే పరిస్థితి ఉండేదన్నారు. తాను యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో ఉండగా పట్టభద్రులు ఎంఎల్‌సి ఎన్నికల్లో యుటిఎఫ్ ఎందుకు పోటీ చేయకూడదని లేవనెత్తిన అంశం నేడు పట్టభద్రుల ఎన్నికల్లో కూడా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు విజయం సాధించడం అని ఆయన గుర్తు చేశారు. ఈ పరిచయ వేదికలో పట్టభద్రులు ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులు మాట్లాడుతూ 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ ఉద్యమంలో కొనసాగానని, పట్టభద్రులు తరపున వారి సమస్యలు పరిష్కరించడానికి పోరాటం చేస్తానని అన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తాను క్రమశిక్షణ కలిగిన యుటిఎఫ్ కార్యకర్తగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నానని గుర్తు చేశారు. ప్రజాసంఘాల నాయకులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్య క్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నిక ఏదైనా విజయం పిడిఎఫ్‌దే అని, యుటిఎఫ్ నాయకులు కష్టించి పనిచేసే గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కెఎస్ఎస్.ప్రసా ద్, గార చిట్టిబాబు, ఎన్.అరుణకుమారి, టి.చక్ర వర్తి, ఎస్.జ్యోతిబసు, ప్రజాసంఘాల నాయకులు దువ్వా శేష బాబ్జి, ఎం.రాజశేఖర్, బల రాం, దుర్గాప్రసాద్, కృష్ణవేణి, అమూల్య, డాక్టర్ చల్లా రవికుమార్, పీతల రామచంద్రరావు, కె.శం కర్, తాడిశ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర 33/11 కె.వి సబ్ స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం ఫీడర్ 11కెవి లైన్లపై చెట్లు కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాల రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలో కపిలేశ్వరపురం, వెదురుమూడి, పడమరఖండ్రిక, అంగర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కాలుష్య రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పచ్చదనం పెంపొందించి, పర్యావరణాన్ని పరిరక్షించి కాలుష్యరహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ అన్నారు. గురువారం మండలంలోని వద్దిపర్రు గ్రామంలో పర్యావరణం పరిరక్షణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌డిఒ పి.శ్రీకర్ మాట్లాడుతూ పర్యావరణం తదితర అంశాలపై ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టిఆర్.రాజేశ్వరరావు, ఆత్రేయపురం ఆర్ ఐ భాను తదితరులు పాల్గొన్నారు.

## చేసిన సేవలతోనే గుర్తింపు

ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఉద్యోగి విధి నిర్వహణలో అంకిత భావంతో ప్రజలకు అందించిన సేవలు గుర్తింపునిస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని డిఇఒ కార్యాలయంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్ మడకం చామంతి, సమగ్ర శిక్షా కార్యాలయ ఆఫీస్ సబార్డినేట్ ముగ్గుళ్ల వెంకన్నలకు గురువారం వీడ్కోలు సభ ఏడి నాగేశ్వర రావు అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఇఒ డాక్టర్ సలీం బాషా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, అయితే ఆ ఉద్యోగి సామాన్యులకు అందించిన సేవలే చిరకాలం నిలుస్తాయన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరినీ దుశాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు, సమగ్ర శిక్షా ఇఇ సుబ్బరాజు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బివివి. సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, డాక్టర్ ఎంఎకె.భీమారావు, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్ భాను, ఎఎస్ఒ డి.తాతారావు, సమగ్ర శిక్షా కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్ నిర్మాణం అడ్డగింతపై ఫిర్యాదు

ఫిర్యాదు చేయడానికి కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సర్పంచ్, గ్రామస్తులు (ఇన్‌సెట్)లో గున్నేపల్లి అగ్రహారంలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో నిర్మిస్తున్న మంచినీరు ట్యాంక్ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు ఆధ్వర్యంలో స్థానికులు గురువారం కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుందర్ నగర్ కాలనీలో జలజీవన్ మిషన్ ద్వారా 20 వేల లీటర్ల ఓ హెచ్ ఆర్ ఎస్ వాటర్ ట్యాంక్ మంజూరైందని, నిర్మాణం జరుగుతోందన్నారు. దీనిని ప్రభుత్వ భూమిలో నిర్మించాలని పంచాయతీ పాలకవర్గం కూడా తీర్మానించిందన్నారు. ఆ భూమి తనదేనంటూ ముత్తా బత్తుల వీర వెంకట సత్యనారాయణ, తండ్రి సుబ్బారావు కబ్జా చేసి వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు అడ్డుపడుతున్నాడు. వచ్చే వేసవి కాలానికి దీనిని పూర్తి చేసి గ్రామ ప్రజలకు మంచినీరు అందించాలని ఒక వైపు పనులు వేగవంతం చేస్తుంటే రెండో వైపు పనులకు ఆటంకం కలిగించడంతో ప్రజలకు మంచినీరు అందుతుందా అని సర్పంచ్ విచారం వ్యక్తం చేశారు. ఆ స్థలము పై సత్యనారాయణ, అతని కుటుంబ సభ్యులకు ఏ విధమైన హక్కు లేనప్పటికీ దానిని ఆక్రమించుకోవాలని దురుద్దేశంతో ప్రజా ఉపయోగ పనులకు అడ్డుపడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు ఈ విషయమై పూర్తి దర్యాప్తు జరిపించి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

ఇవిఎంలు, వి విప్యాట్‌లు భద్రపరిచిన గొడౌన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం), వివి ప్యాట్ గోదాములకు భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు ముఖ్య కార్యనిర్వాహక అధికారి తాతబ్బాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం మూడవ అంతస్తులో భద్రపరిచిన ఇవిఎం మిషన్లు, వివిప్యాట్ గోదాములను శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు ముఖ్య కార్యనిర్వాహక అధికారి తాతబ్బాయి, జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి సంయుక్తంగా ఎన్నికల సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం అదనపు ముఖ్య కార్యనిర్వాహక అధికారి తాతబ్బాయి మాట్లాడుతూ ఇవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల ప్రకారం ప్రతి నెలా ఇవిఎం, వివిప్యాట్ గొడౌన్‌ను తనిఖీ చేసి, పరిశీలించిన అంశాలను ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదికను పంపించాలని సూచించారు.అదే విధంగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పరిశీలించి నివేదికను పంపించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి వెల్లడించారు. అనంతరం అగ్నిమాపక అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, సిసి కెమెరాల దృశ్యాల పని తీరును పరిశీలించారు.ఈ తనిఖీల కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ సుబ్బలక్ష్మి, ఎన్నికల విభాగం ఉప తహశీల్దార్ శివరామ్ రామోహనరావు, సాయిరామ్, అగ్నిమాపక, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కిశోర వికాస బాలికల సంరక్షణ అందరి బాధ్యతని కొత్తపేట సిడిపిఒ ఎ.గజలక్ష్మి అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలులో కిశోర వికాసం మండల స్థాయి శిక్షణా కార్యక్రమం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి బికెఎస్ఎస్.వెంకట రామన్ పాల్గొని మాట్లాడుతూ 11 సంవత్స రాల నుంచి 18 సంవత్సరాల వయ స్సు గల కిశోర బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం, ఆహారం, నైపుణ్య ఉపాధి, ఆత్మ రక్షణ, లింగ వివక్ష, వ్యక్తిగత పరిశుభ్రత, పరిశుభ్రత లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివా హాలు అరికట్టుట, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. గ్రామ కమిటీల ద్వారా ఉన్నత పాఠశాల లోను, జూనియర్ కళాశాలలోను కిశోరి బాల బాలికలకు శిక్షణ ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ పి.సౌమ్య, విద్యాశాఖాధికారులు, పి.వరప్రసాదరావు, పి.సాహెబ్, ఎపియం గంగాధరారావు, ఐసిడిఎస్. సూపర్ వైజర్లు, కుమారి, పద్మావతి, హెల్త్ సిబ్బంది, గ్రామ స్కూల్ టీచర్స్, కలశాల లెక్చరర్స్, సచివాలయ సిబ్బంది, పారా సంస్థ కో.ఆర్డినేటర్స్, జెకె.డబ్ల్యూఎస్, అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ వారు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

మాట్లాడుతున్న కార్మికశాఖాధికారి నాగ మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - ఆలమూరు

కార్మికు లు పని చేస్తున్న ప్రాంతాలలో కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని రిజిస్ట్రర్లు, రికార్డులు నిర్వహించాలని మండ పేట కార్మిక శాఖ అధికారి కాశీ నాగ మల్లేశ్వరరావు సూచించారు. పని ప్రదేశాలలో కార్మిక చట్టాలను అమలు చేసే బాధ్యత యాజమాన్యాలపై ఉందని అన్నారు. ఆయన ఆలమూ రులో ఇటుకబట్టీలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్మికులతో గురు వారం మాట్లాడారు. అనంతరం బట్టీల వద్ద కార్మిక రికార్డులను పరిశీలించారు. రికార్డులలో ఉన్న లోపాలను సవరించు కోవాలని సూచించారు. పనిచేస్తున్న వారిలో ఒక్కొక్క కార్మికునికి రూ. వంద చొప్పున కార్మిక సంక్షేమనిధికి బ్యాంక్లో చలానా తీయాలని మల్లేశ్వరరావు తెలిపారు. బట్టీలలో బాలకార్మికులను చేర్చుకోవద్దని అన్నారు. కార్మికులకు విధిగా కార్మిక వేతన చట్టం అమ లు చేయాలని ఆయన సూచించారు.

### కార్టూ'నిజం'



మానవ అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు



## గాంధీకి ఘన నివాళి

అమలాపురంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

వేగాయమ్మపేటలో నిర్వహించిన గాంధీ వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

పాశర్లపూడిలంకలో గాంధీజీ వర్ధంతి

కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో గాంధీ వర్ధంతి

రావులపాలెంలో గాంధీ చిత్రపటం వద్ద ఎంఎల్ఎ సత్యానందరావు నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లాలో గురువారం ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **అమలాపురం:** స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి స్థానిక కలెక్టరేట్ పరిపాలనాధి కారి కె.కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పూలమాలవేసినివాళులు అర్పించారు. కార్యక్రమంలో వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి, భూసేకరణ సెక్షన్ అధికారి ఏసుబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **రామచంద్రపురం :** పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నాయకులు,కార్యకర్తలు నివాళు లర్పించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. వేగాయమ్మపేట పంచాయతీ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. **కె.గంగవరం :** మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపిపి పంపన నాగమణి తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పంపన సుబ్బారావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెపి.రాజు అధ్యక్షతన గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** నగర పంచా యతీ పరిధిలోని లంక తల్లమ్మ గుడి సెంటర్లో ఉన్నా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులార్పించారు. ఈ కార్యక్రమంలో పి.జగ్గప రాజు, వడ్డీ నాగేశ్వర రావు, గుబ్బల రవి, పి.ఉదయ భాస్కర వర్మ తదితరులు పాల్గొ న్నారు. **రావులపాలెం:** స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు అధ్యక్షతన నిర్వహించిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాసాబత్తుల ఆనందరావు, అత్తిలి వెంకటేశ్వరరావు, దొడ్డం త్రినాధరావు, యర్రంశెట్టి బుజ్జి, సాధనాల శ్రీనివాస్, బొంతు రాంబాబు,వడ్లమూడి రామారావు తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు**: పాశర్లపూడి లంక పంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ తెలగారెడ్డి సూర్య ప్రకాష్‌రావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ గాంధీ కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల చూపిన ప్రేమానురాగాలు, చేసిన సేవా కార్యక్రమాల కారణంగా వారి వర్ధంతిని జాతీయ కుష్టు నిర్మూలనా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే కుష్టువ్యాధిగా అనుమానించాలని, లూటుకుర్రు పిహెచ్‌సిలో ఈ వ్యాధికి తగిన చికిత్స అందిస్తారని హెల్త్ అసిస్టెంట్ ఏడిద కవింద్ర చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు చెరుకూరి పార్వతీదేవి, సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి డి సురేష్ , విఆర్ఒ, ఎఎన్ఎం కస్తూరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గాంధీ వర్ధంతిని పెదపట్నం పంచాయతీలో సర్పంచ్ గుబ్బల దుర్గ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమ్ముల నందుబాబు, కార్యదర్శి జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్వేది ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది దేవాలయ పరిసర ప్రాంతాలు, బీచ్, ఫెర్రీ పాయింట్లను గురువారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పరిశీలించారు. అనంతరం కళ్యాణ వేదిక వద్ద జిల్లా స్థాయి అధికారులతోఉత్సవ ఏర్పాట్ల పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4 నుండి 13 వరకు అంతర్వేది గ్రామంలోశ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి తిరు కళ్యాణ ఉత్సవాలకు విచ్చేసే యాత్రికులకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ ఉత్సవాలను అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. దేవాలయ ప్రాంతం బీచు బోటు పార్కింగ్ తదితర ప్రాంతాలను యాత్రి కులు సులభతరంగా గుర్తించేందుకు పంచాయ తీరాజ్ విభాగం వారు సైన్ బోర్డులు దేవాలయ ప్రాంగణం నందు లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవస్థానము నందు ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్ బీచ్ వద్ద మినీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 21 శాఖల సిబ్బంది 24 గంటలు పనిచేస్తారన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్కు వివిధ ప్రాంతాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ అనుసంధానం చేస్తూ మొత్తం వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. జిల్లా రవాణా అధికారి ఉత్సవాలకు వచ్చే యాత్రికుల వాహనాలు ఓవర్ లోడ్ లేకుండా ఎప్పటికప్పుడు పరివేక్షించాలన్నారు. ఆర్‌డబ్ల్యు ఎస్ అధికారులు 20 స్టాల్స్ ఏర్పాటు చేసి తాగునీటిని సమద్ధిగా అందించడంతో పాటుగా యాత్రికుల సౌకర్యార్థం120 మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఎపిడి దేవ స్థాన పరిసర ప్రాంతాలలో పారిశుధ్యం వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. ట్రాన్స్‌కో అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటుగా ప్రత్యామ్నా యంగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు శాఖ అధికారులు సమన్వయంతో ధరల నియంత్రణ తూనికలు కొలతలు పై దృష్టి సారించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్సవాలలో ప్రసాదాలు ఆహార పదార్థాలను వర్తకులు అమ్మే ఆహార పదార్థాల కల్తీలను పర్యవేక్షించాలన్నారు. కళ్యాణ వేదిక వద్ద అమలాపురం ఆర్‌డిఒ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తార న్నారు. చక్రస్నానం ప్రక్రియను రామచంద్రపురం ఆర్‌డిఒ పర్యవేక్షించాలన్నారు. ఆర్‌టిసి 105 బస్సులను ఏర్పాటు చేస్తూ ప్రయాణికులు రాకపోకలు సురక్షితంగా నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్ కుమార్ బోటింగ్ పాయింట్ను, అంతర్వేది హర్బర్ ను సందర్శించి హర్బర్ నిర్వహణ తీరు పట్ల మత్స్యకార సొసైటీలు ప్రతినిధులతో చర్చించా రు. ఈ సందర్భంగా మత్స్యకారులు సదు పాయాలు కల్పించాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కార్య క్రమంలో జెసి టి.నిషాంతి, ఉత్సవ కమిటీ సభ్యులు బాలాజీ, అడ్మిన్ ఎస్‌పి ప్రసాద్, డిఎస్‌పి లు, ఆర్‌డిఒలు డి.అఖిల, కె.మాధవి, దేవస్థానం ఇఒ సత్యనారాయణ, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### మహిళ చేతిలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని డైరీ ఫార్మ్ సెంటర్ స్వర్ణాంధ్ర కాలనీ టిడ్కో గృహాల సముదాయంలో దారుణం చోటుచేసుకుంది. ఒక మహిళ కత్తితో దారుణంగా ఒక వ్యక్తిని పట్టపగలు హత్య చేసింది. స్థానిక పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రావులపాలెం ప్రాంతానికి చెందిన గుడాల చంద్రశేఖర్ (30) అదేవిధంగా తిరుపతి ప్రాంతానికి చెందిన లావణ్య ఇద్దరు గత కొంత కాలం క్రితం వరకు సహజీవనం చేసేవారు. అయితే లావణ్య చంద్రశేఖర్‌ను వదిలేసి వేరే వ్యక్తితో టిడ్కో గృహాల సముదాయంలో ప్లాట్ నెంబర్ సి బ్లాక్ 28లో నివాసం ఉంటున్నారు. అయితే విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ గురువారం లావణ్య వద్దకు వచ్చి నిలదీయడంతో వివాదం చెలరేగి లావణ్య కత్తితో దారుణంగా నరకడంతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అనుమానాస్పద మృతిపై కేసు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక డైరీ ఫార్మ్ సెంటర్ సంజయ్ నగర్ ఎఎంజీ స్కూల్ రోడ్డు చివర్లో గుర్తుతెలియని వ్యక్తి (30) మృతి చెందిన సంఘటనపై పోర్టు పోలీసులు అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేశారు. పోర్టు పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి రక్తపు గాయాలతో నడుచుకుంటూ వచ్చి రోడ్డుపై పడి మృతి చెందడం జరిగిందన్నారు. ఈ విషయంపై పోర్టు పోలీసులకు ఏడు గంటలకు సమాచారం రాగా స్థానిక విఆర్‌ఒ సోమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతిని తలపైన, గుండెపైన బలమైన గాయాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

### రైలులో చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట

లింగంపల్లి నుంచి సామర్లకోట గౌతమి ఎక్స్‌ప్రెస్ రైల్లో వస్తుండగా బ్యాగులో పెట్టిన బంగారు గాజులు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్లో గురువారం బాధితురాలు ఫిర్యాదు చేశారు. పిఠాపురం జెఆర్ నగరంకు చెందిన చక్రవర్తుల షణ్ముఖరాణి బుధవారం రాత్రి లింగంపల్లిలో గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి గురువారం సామర్లకోటకు చేరుకున్నారు. అయితే రైలులో నిద్రకు ఉపక్రమించే ముందు చేతికున్న బంగారు గాజులను బ్యాగులో పెట్టుకున్నట్లు తెలిపారు. సామర్లకోటలో రైలు దిగిన తర్వాత బ్యాగ్‌లో చూడగా బంగారు గాజు కనిపించలేదని ఆమె ఫిర్యాదు చేశారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 35 కేసుల నమోదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ట్రాఫిక్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. 35 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఎజెఎఫ్‌సి మెజిస్ట్రేట్ రమ్య నిందితులకు వివిధ శిక్షలు విధించారు. మొత్తం 35 మందిలో 34 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ఒకరికి ఒక్క రోజు జైలు శిక్ష విధించారు.

### రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఎకు గాయాలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేటలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఎకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ గురువారం తెలిపారు. నరేంద్రపురం విఆర్‌ఎ బీర పెద సత్యనారాయణ అంబాజీపేట నుంచి మోటారు సైకిల్ పై ఇంటికి వెళుతున్నాడు. ఆ సమయంలో ఒక ప్రయివేటు బ్యాంకు ఎదురుగా లారీ వెనకకు వస్తూ అతనిని ఢీకొట్టడంతో గాయాలు అయ్యాయి. దీంతో విఆర్‌ఎ అమలాపురం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### ఉప్పాడలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో పోలీసులు గురువారం ద్విచక్ర వాహనాలు తనిఖీ చేశారు కాకినాడ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారులను ఆపి హెల్మెట్ లేకుండా వెళ్లవద్దని సూ చించారు. రెండోసారి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని కౌన్సిలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకో అనే నినాదంతో తనిఖీలు చేస్తున్నామ ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

### పాలు, పండ్ల పంపిణీ

ప్రజాశక్తి - పిఠాపురం

విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా మాతృమూర్తి జేహర భేగం 7వ వర్ధంతి సంధ్బంగా అజిమా జహారమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా, అజిమా జహారమ్మ సేవా సంస్థ అధ్యక్షులు అహ్మద్ ఆలీషా సోదరులు పాల్గొన్నారు. ఉమర్ ఆలీషా మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న వారికి సాయం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్య క్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, కుటుంబ సభ్యులు హుస్సేన్ షా, ఖలీల్ షా, బాదుషా, ఆసుపత్రి సిబ్బంది, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వెట్లపాలెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో 11 కెవి ఫీడర్లు, డిఎస్‌ఎ ఫీడర్, వేట్లపాలెం సబ్ స్టేషన్, వేట్లపాలెం ఇండస్ట్రియల్ ఏరియా, తిమ్మాపురం పనసపాడు సబ్ స్టేషన్ పరిధిలో చేపట్టే మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. ఉండూరు గ్రామం ఇండస్ట్రియల్ ఏరియా, వికె.రాయపురం, అచ్చంపేట, పనసపాడు, కొప్పవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు.

### ఎపిపి శేషారావుకు సన్మానం

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అమలాపురం జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శేషారావు కలెక్టర్ మహేష్‌కుమార్, ఎంపీ హరీష్ మాదుర్ చేతుల మీదగా ఉత్తమ సేవ ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం శేషారావును అమలాపురంలో ఆయన నివాసంలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, లాయర్ కప్పల సునీల్ కుమార్ కలిసి అభినందించారు. ఆయనకు దుశ్శాలువా కప్పి, బొకే అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో సునీల్ మాట్లాడుతూ శేషారావు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ఉత్తమ సేవలందిస్తూ ఆదర్శంగా నిలవాలన్నారు కార్యక్రమానికి అమలాపురం రిటైర్డ్ అధికారులు పి.చిట్టిబాబు, కె.సత్యనారాయణ, బాల రవి, తదితరులు పాల్గొన్నారు.

### 'బిఎస్‌పి బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బహుజన సమాజ్ పార్టీ(బిఎస్‌పి) బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలంతా సమిష్టిగా పని చేయాలని పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుమ్మాపు చిత్ర సేన్ పిలుపునిచ్చారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానికఅంబేద్కర్ కన్వెన్షన్ హాలు నందు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు అధ్యక్షతన నియోజకవర్గం సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో చిత్రసేన్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి బూత్, సెక్టార్, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను నియమించి క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల గుర్తించి, వాటి అధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కరానికి కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు వాకపల్లి బీమారావు, జిల్లా ఇన్‌ఛార్జ్ కాశి లక్ష్మి భవాని, బడుగు భీమేశ్వర రావు, కుసుమ శ్రీను, బండి మరిడెష్, పోలిశెట్టి శ్రీను, పరమట వెంకట్ పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల న్యాయ సేవాధికార సంస్థ పరిధిలో ఉన్న రంగంపేట, జగ్గంపేట, గండేపల్లి, పెద్దాపురం మండలాల నుంచి అర్హులైన న్యాయ సేవ కార్యకర్తల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 7 వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను ఫిబ్రవరి 4వ తేదీలోగా అందజేయాలన్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన దరఖాస్తుల నుంచి 25 మందిని న్యాయ సేవా కార్యకర్తలుగా ఎంపిక చేస్తామన్నారు. వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ పొందిన తర్వాత ఆయా మండలాల పరిధిలో న్యాయ సేవా కార్యకర్తలుగా పనిచేయుటకు గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, ఎంఎస్‌డబ్ల్యు విద్యార్థులు, న్యాయ విద్య అభ్యసించేవారు, దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇతర సాంకేతిక ఉత్తీర్ణత పొందినవారు ఫిబ్రవరి 4వ తేదీ లోగా పెద్దాపురం కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయ సేవాధికార సంఘంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

### ఆదిత్యలో జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో నేడు, రేపు జరిగే ఐడియాథాన్ జాతీయ స్థాయి సదస్సు గురువారం ప్రారంభం అయింది. ఎఐసి-టిహెచ్‌యుబి ఫౌండేషన్, టెక్కీబాట్ సంస్థల భాగస్వామ్యంతో ఈ సదస్సు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పరిశ్రమ 4.0 సాంకేతికతలను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, ఆటోమొబైల్ ఆటోమేషన్ మొదలైన వాటిని ఉపయోగించి వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించేందుకు తమ సృజనాత్మక ఆలోచనలు ప్రదర్శించనున్నారు. ఈ ఐడియా థాన్ కార్యక్రమం, విద్యార్థులకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించే అవకాశం కల్పిస్తూ, వారికి ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమం అవకాశం కలిగిస్తుందని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. భారతదేశంలో ఉన్న ప్రతిభా లక్షణాలను, జ్ఞానాన్ని, సాంకేతికతలను సమీకరించి, యువతకు పరిశ్రమ 4.0 నైపుణ్యాలను నేర్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆదిత్య ప్రో ఛాన్సలర్ డాక్టర్ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ టి హబ్ సిఇఒ రాజేష్‌కుమార్ అడ్ల, టెకిబోట్ ఫౌండర్ సిఇఒ నల్లమిల్లి వెంకటరెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్‌లు, విభాగ అధిపతులు పాల్గొన్నారు.

### పిఆర్ జెఇ అబ్బాయిదొరకు ఘన సత్కారం

ప్రజాశక్తి- గోకవరం

స్థానిక మండల కార్యాలయంలో పిఆర్ జెఇ అబ్బాయిదొరను పంచాయతీ కార్యదర్శులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన అబ్బాయి దొర ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

### కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం .

మండలంలోని అచ్యుతాపురం పిహెచ్ సి పరిధిలోని నల్లూరు, వెదురుమూడి, వడ్లమూరు, వల్లూరు, కాలేరు, అచ్యుతాపురం, గ్రామాల్లో గురువారం కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహరా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారాణి డాక్టర్ విజయ దీపిక 'స్పర్శ - కుష్టు వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలు, ఉచిత చికిత్స తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ సిహెచ్.గోపాలకష్ణ, ఎంపిహెచ్ఎస్.శ్రీధర్, హెల్త్‌విజిటర్ వి. వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.రవీంద్ర కుమార్, ఎఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి - పిఠాపురం, కరప

ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు వెంటనే కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని విరవాడ పిహెచ్‌సి కాలనీ కమ్యూనిటీ హాల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిఠాపురం మండల కమిటీ సమావేశం సంఘం మండల అధ్యక్షులు రుద్రవరపు భూలోకం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉపాధి కూలీలు వ్యవసాయ కార్మికులు ఇతర పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పై గ్రామాల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కనీసం 150 రోజులు పని కల్పించాలని, రూ.500 ఖచ్చితంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలని, మేట్లకు పారితోషకం ఇవ్వాలని కోరారు. గతంలో ఇచ్చిన మాదిరిగానే పరికరాలు, టెంట్‌లు, మెడికల్ కిట్లు పని ప్రదేశంలో ఏర్పాటు చేయాల న్నారు. పి.తిమ్మాపురం, మంగితుర్తి తదితర గ్రామాల్లో స్మశాన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహాచలం, మండల నాయకులు డెక్కల లాజరు, మేడపాటి చంటిబాబు, ఎం.ఆశీర్వాదం, దవ్వాల కృష్ణ, జి.సుబ్రహ్మణ్యం, డి.సుబ్బు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కరప సంఘం మండల సమావేశం స్థానిక రామాలయం వద్ద చోడిశెట్టి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. మండలంలో మేట్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూలీలతో సమావేశాలు నిర్వహించి ఎంపిక చేయాలని అన్నారు. రాబోవు సీజన్లో ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించి వేతనం రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మందనకు జగ్గరాజు, దేవి వెంకటరమణ, వేపకాయల వెంకట్రావు, ఆచంట వెంకన్న, నున్న చంద్రావు, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, పాటినీడి భూలోకరాయుడు, తుమ్మలపల్లి సూరిబాబు పాల్గొన్నారు.

### రెడ్ క్రాస్ రాష్ట్ర ఛైర్మన్‌గా రామారావు

ప్రజాశక్తి - కాకినాడ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ నూతన ఛైర్మన్‌గా వైడి.రామారావు ఎన్నిక అయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్య నిర్వాహక వర్గ సమావేశంలో రామారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ ఎ.శ్రీధర్ రెడ్డి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో గత 26 సంవత్సరాలుగా రెడ్ క్రాస్‌తో అనుబంధం కలిగి 8 సంవత్సరాలుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాఖ, కాకినాడ జిల్లా శాఖ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామారావును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వైడి రామారావును రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ సభ్యులు, జిల్లా శాఖ సభ్యులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

### కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-యంత్రాంగం

**రాజమహేంద్రవరం రూరల్** బొమ్మూరులోని శ్రీవివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర ఆధ్వర్యంలో లెప్రసీ కాలనీలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి అంజలి ఘటించారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుష్టు వ్యాధి నిర్మూలనకు ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ ఈ నెల అనగా జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు జిల్లా అంతటా నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ వ్యాధి 2027 సంవత్సరానికి భారతదేశంలో పూర్తిగా అరికట్టడానికి ప్రజల సహకారం అవసరం అని తెలిపారు. అనంతరం బొమ్మూరులోని శ్రీ వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలోని 40 మంది రోగులకు దుప్పట్లు, పులిహోర ప్యాకెట్లను పాలచర్ల పిహెచ్‌సి హెచ్‌వి కెఎస్-ఎస్.కుమారి, పంపిణీ చేశారు. రామచంద్రపురానికి చెందిన గుణ్ణం రామకృష్ణ చౌదరి 40 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, రిటైర్డ్ డిపిఎంఒ మానుకొండ డేవిడ్ స్వీట్స్ పంచారు. **ఉండ్రాజవరం:** సూర్యారావుపాలెంలో వేలివెన్ను పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ ఆరోగ్య సిబ్బందితో లెప్రసి వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. **గోకవరం:** అచ్యుతాపురంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో కుష్టి వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పి మౌనిక మాట్లాడారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.రాజేశ్వరి, ఎఎస్ఎం.మంగాదేవి, టిడిపి గ్రామ అధ్యక్షుడు కోలా ఏసుబాబు, కొత్తపల్లి సత్యనారాయణ, పిట్టా అరుణ్, ఆకుల కాశి, నల్లల నాగేశ్వరరావు, పెనుమచ్చ అచ్చయ్య, అయినం నాగు, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఆశా వర్కర్లు రామ తులసి, లావణ్య పాల్గొన్నారు.

### బాధితుల రక్షణ కోసం సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సమాజంలో అణగారిన వర్గాల ప్రజలలో చైతన్యం నింపడానికి పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని చివటం గ్రామం, ఎస్‌సి పేట, కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జస్టిస్ పున్నయ్య కమిషన్ సర్వే నివేదిక ఆధారంగా సమాజంలో ప్రజల మధ్య వివక్ష ఉందా అనే విషయం తెలుసుకుని ఆయా వర్గాల ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని, వారిని ఎవరైనా చులకనగా చూస్తే బాధితులకు న్యాయం అందజేసి, నష్టపరిహారం కూడా అందజేస్తారన్నారు. వివక్షకు గురి చేసిన వారు ప్రభుత్వం విధించే శిక్షకు గురవుతారని అన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలలో కుల వివక్ష, వర్ణ వివక్ష బాగా తగ్గిందన్నారు. దేవాలయాలు, ప్రార్థనా స్థలాల్లో పాల్గొనేందుకు ఎవరూ అడ్డు పడకూడదని, కనీసం హోటల్‌లో కూడా ఈ వివక్ష కొనసాగకూడదని అన్నారు. ఎక్కడైనా, ఎవరైనా వివక్షకు గురైతే అధికారులకు వెంటనే తెలపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, డిటిఎం హరి ప్రసాద్, హెచ్‌డబ్ల్యుఒ కె.వెంకట ప్రసాద్, విఆర్‌ఒ డి.సోమిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ, సుబ్బారావు, వీర్రాజు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - మండపేట

పట్టణం, మండపేట మండలం లో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల మరణించిన మండపేట పట్టణానికి చెందిన కోడూరి లక్ష్మి రిమ్మలపూడి తులసి మండలంలోని పాలతోడులో ఉప్పులూరి సోమరాజు, అప్పసాని లక్ష్మికాంతం, ఏడిద సీతానగరం నంబూరి సూర్యకాంతం, ఏడిదలో హరిదాసుల లక్ష్మయ్య, అవ్వారు వీరవెంకట సత్యనారాయణమూర్తి, యరమాటి సంఘారావుల కుటుంబాలను ఎంఎల్‌ఎ పరామర్శించారు. ఆయన వెంటఉండు వీరతాతరాజు, కాటా గోపి, వల్లూరి నారాయణమూర్తి, రిమ్మలపూడి చంద్రశేఖర్, పాలచర్ల రామకృష్ణచౌదరి, రిమ్మలపూడి రాజాప్రసాద్, వేగుళ్ళ రవికుమార్, పిల్లా తాతాలు తదితర్లు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-తాళ్లపూడి

స్కూటర్, కార్లలో ప్రయాణం చేసే సమయంలో ప్రతి ఒక్కరూ ప్రమాదాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ టి.రామకృష్ణ సూచించారు. రహదారి భద్రత మాస ఉత్సవాలలో భాగంగా తాళ్లపూడి పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంతోపాటు తాము నడిపే వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుండా మరియు వేగంగా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ విధంగా డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారిన పడవద్దని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

IN THE COURT OF THE 1ST ADDITIONAL. SENIOR CIVIL JUDGE : KAKINADA
E.A. No. 57 of 2024 in O.S.No. 238 of 2014
Between:
Bodiredla Padmavathi ...Decree Holder/Plaintiff
and
1] Batchu Chandra Sekhar [Died].
2] Batchu Dhanalakshmi,
3] Batchu Divya. ...Judgment Debtor/Defendant.
To:
2) Smt. Batchu Dhanalakshmi, W/o. Late Batchu Chandra Sekhar, [PC No. 3206] [Died], D.No. 2-462-1, Bapannadora Colony, Ramanayyapeta, Kakinada, Kakinada District.
3) Batchu Divya, D/o. Late Batchu Chandra Sekhar [PC No.3206] [Died], Door No. 2-462-1, Bapannadora Colony, Ramanayyapeta, Kakinada, Kakinada District.
పై నెంబర్ అమలు గ్రంధం నందు జేడ్జిమేంట్ డేబిటార్స్ / ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టువారు నుండి సమన్లు పంపించిననూ పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావునా సదరు ప్రతివాది అయిన మీరు **ది. 18-02-2025 వ తేదిన ఉదయం గం. 10.30 ని॥లకు** పైన ఉదహరించిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయ్యి మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న శ్రీ కోర్టు వారికి తెలియపరుచు కోనవలేను, లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమునందు విచారించి తీర్మానము చేయుదురు అని యిందుమూలముగా తెలియజేయడమైనది.
**పలివెల వెంకటేశ్వరరావు,** B.Com.,B.L.
అడ్వకేట్, డోర్ నెం. 1-12-5, మిలిటరీ రోడ్,
కాకినాడ భానుగుడి జంక్షన్ దగ్గర, కాకినాడ.
ది.30-1-2025 సెల్: 98488 48152

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
O.S.No.545/2024
Between:-
Pamu Babu Rao ...Plaintiff
And
1. Palukuri Srinivass Rao, S/o. Suryanarayana, Hindu, aged about 55 years, D.No. 4-86, Panchayat Street, Veeravaram Village, Kadiyam Mandal, East Godavari District. Presently (residing at D.No.104-7-485, Adarsa Nagar, Hukumpeta, Rajamahendravaram Rural,E.G.Dt
2. Palukuri Seetha Mahalakshmi. W/o. Palukuri Srinivasa Rao, Hindu, aged about 45 years, D.No.4-86, Panchayat Street, Veravaram Village, Kadiyam Mandal, East Godavari District. Presently residing at D.No.104-7-485, Adarsa Nagar, Hukumpeta, Rajamahendravaram Rural,E.G.Dt ...1,2,Deffendants
పై నంబరు దావాలో 1,2, ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వ కంగా త్రిప్పివేయుచున్నారు. కావున ది.**06-02-2025**సం॥రం తేదీ ఉదయం **10.30ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
అవదానుల సుబ్బారావు
రాజమండ్రి అడ్వకేట్
ది.30-01-2025 రాజమండ్రి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
O.S.No.105/2023
Between:-
State Bank of India, Rep by its Branch Manager, Divancheruru Branch, Rajamahendravaram Rural ...Plaintiff
And
Jami Murali Mohan Son of Rama Rao, Hindu Aged 44 years, LDC Employee,Primary Health Center, Maredumilli and residing at Flat No.101, Srvya Enclave,Bijapuri Township, Divancheruvu,Palacherla. ...Deffendant
పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వ కంగా త్రిప్పివేయుచున్నారు. కావున ది.**10-02-2025**సం॥రం తేదీ ఉదయం **10.30ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది .
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పుత్రేవు ఉపేంద్రకుమార్
రాజమండ్రి అడ్వకేట్
ది.30-01-2025 రాజమండ్రి

మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 1099/2023
Between:
Jaddu Leela Mrutyum Jaya, S/o. late Sriramulu, Hindu, aged 60 years, D.No. 36-27-2, Ballavari Street, Kotipalli Bus Stand Backside, Innispeta, Rajamahendravaram, E.G.District. ...Plaintiff
AND
Kavala Venkateswara Rao, S/o. Musalayya, Hindu, aged 58 years, Employee, Record Assistant, Government Boys High School, Kovvur, E.G.District. ...Defendant
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 17-2-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎం.సూర్యమోహనరావు
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
30-1-2025 సెల్:9494008816

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకూ జిల్లాలో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డిఆర్ఒ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. గురువారం పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో రెవెన్యూ, విద్యా, వైద్య ఆరోగ్యం, పోలీస్, విద్యుత్, ఎపిఎస్‌ఆర్‌టిసి, పొస్టల్ ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 19 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి1 నుంచి 20 వరకూ థియరీ పరీక్షలు జరగనున్నాయన్నారు. ఈ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. కాకినాడ జిల్లాలో ప్రయోగ పరీక్షలకు 89, పబ్లిక్ పరీక్షల నిమిత్తం 56 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షలు అన్ని సక్రమంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### నేడు సామర్లకోట కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

దస్తావేజులు పోయినవి
కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం సీతానగరం కాపురస్తులు గూడపటి వెంకట సత్యనారాయణ తండ్రి రమణ అనే నేను సీతానగరం నుంచి జగ్గంపేట వస్తుండగా సీతానగరంలో దస్తావేజు నంబర్ **671/1955** గల **2 సెంట్లు** భూమి కలదు. ఈ డాక్యుమెంట్‌లు పట్టుకొని జగ్గంపేట వస్తుండగా మార్గమధ్య పడిపోయినవి. వీటిపై ఎటువంటి లావాదేవీలు చేరిన చట్టరీత్యా నేరం. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి అందజేస్తారని కోర్తుఉన్నాము.
అడ్రస్
గూడపాటి వెంకట సత్యనారాయణ
సెల్ 8096843593

CHANGE OF NAME
I, BONDADA BALA MEHER SUREKHA, C/o. Bondada Uma Sankar, 68-09-03, Flat No. 1A, Srikrishna Nagar, SBI Officers Colony, Grand Sanman Apartment, Rajamahendravaram Urban, E.G. District, A.P., My name is changed name from **KORIMILLI BALA MEHER SUREKHA** (Old Name) to **BONDADA BALA MEHER SUREKHA** (New Name). Hence forth being called **BONDADA BALA MEHER SUREKHA,** C/o. Bondada Uma Sankar, for all purpose.

దస్తావేజులు పడిపోయినవి
తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం మీనానగరం గ్రామానికి చెందిన మేక పాపయమ్మ వైఫ్ ఆఫ్ వెంకటేశ్వరరావు. మరియు బెజవాడ సూర్రావు కలిసి ఉమ్మడిగా **21 తేదీ ఏడో నెల 1981** సంవత్సరం తాము తంగెళ్ల ధనలక్ష్మి నుండి ఆర్ ఎస్ నెంబర్ **379/1 లో** ఎకరం**1=35** సెంట్లు భూమిని దస్తావేజు నెంబర్ **1215/1981** యొక్క కొనుగోలు చేసి ఉన్నాము. సదరు దస్తావేజులు మా ఇంటి నుండి జిరాక్స్ తీసుకునే నిమిత్తం చాగల్లు వెళ్లచుండగా దస్తావేజులు దారి మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కి తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.
మేక పాపయమ్మ
W/o. వెంకటేశ్వరరావు
మీనా నగరం, సెల్: 9949297256

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ & రూరల్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంటు
రి.క.నెం.1/2025 గ్రామపంచాయతీ కార్యాలయము, ఎ.అన్నవరం Dt.: 24-01-2025
టెండర్ నోటీసు
ఇందుమూలంగా శంఖవరం మండలం - ఎ.అన్నవరం గ్రామ పంచాయతీలో ది. 14-02-2025వ తేదీ మధ్యాహ్నం 2.00ల సమయం నందు శంఖవరం మండలం, ఎ.అన్నవరం గ్రామ పంచాయతీకి చెందిన పాత బస్టాండు వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్‌పై మొదటి మరియు రెండవ అంతస్తులలో వ్యాపారం చేసుకొనుటకు ఆసక్తిగల వ్యక్తులు నుండి 15 సం॥లు కాలం వరకు లీజుకు తీసుకొనుటకు సీల్డ్ టెండర్లు తీసుకొనబడును. అదేరోజు సాయంత్రం 4.00లకు టెండరుదారుల సమక్షంలో తెరిచి ఎక్కువ అద్దె చెల్లించు ఆసక్తి యున్నవారికి గ్రామ పంచాయతీ తీర్మానం. శ్రీ జిల్లా పంచాయతీ అధికారి వారి అనుమతులకు లోబడి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో అతికించిన అన్ని షరతులుకు లోబడి అప్పగించబడును. గ్రామ పంచాయతీ ఆదాయం మెరుగు పరిచే ఉద్దేశంతో ఈ ప్రకటన చేయడమైనది. సీల్డ్ టెండర్లు వేయువారు డిపాజిట్స్‌ను అదేరోజు టెండరు వేయుటకు ముందుగా చెల్లించి ప్రస్తుత భవనంలను షరతులు చూసుకొని సీల్డ్ టెండర్లు దాఖలు చేయవలెను.
సం/- శెట్టిబత్తుల కుమార్‌రాజా
సర్పంచ్, గ్రామ పంచాయతీ,
ఎ.అన్నవరం, శంఖవరం మండలం,
సం/- వాడ్రేవు చక్రవర్తి
పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1
గ్రామ పంచాయతీ, ఎ.అన్నవరం,